క్లుప్తంగా

నేడు మండలస్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్

జే.పంగులూరు: మండలంలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు మండలస్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌కు మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులు వారి సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వాటిలో ఉత్తమ ప్రాజెక్ట్ ఎంపిక చేసి వారికి బహుమతి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్వీట్ షాపులో అగ్నిప్రమాదం

● రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చీరాల అర్బన్: విద్యుదాఘంతో స్వీట్స్ షాప్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈఘటన పట్టణంలోని బోస్‌నగర్ వద్ద గల పట్టాభి స్వీట్స్ షాప్‌లో సోమవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. బోస్‌నగర్‌లోని పట్టాభి స్వీట్స్ షాపు లోపల సోమవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అయితే ప్రమాదంలో స్వీట్స్ తయారీకి ఉపయోగించే సామగ్రి, స్వీట్స్ తయారికి వాడే వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ మేరకు షాపు నిర్వాహకుల వద్ద నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఏటీఎం మోడల్‌తో అధిక లాభాలు



ఏటీఎం మోడల్ సాగును పరిశీలిస్తున్న సభ్యులు

బల్లికురవ: ప్రకృతి వ్యవసాయంలో ప్రతి మహిళా ఏటీఎం మోడల్‌లో సుమారు 30 సెంట్లలో ఆరోగ్యవంతమైన కూరగాయలు, ఆకు కూరల సాగుతో ఇంటి అవసరాలు తీర్చుకోవచ్చని వైఎస్సార్ కేపీ సీసీ పేరయ్య, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ కల్పన తెలిపారు. సోమవారం చెన్నుపల్లి గ్రామంలో ఏటీఎం మోడల్‌లో సాగు చేసిన కూరగాయాలు, ఆకుకూరలను బృందం పరిశీలించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసే పంటలకు చీడపీడల నివారణకు వాడే కషాయాల తయారీ దుకాణాన్ని, తయారీ విధానాన్ని మండల సమీఖ్య సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జులు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై విజ్ఞాన యాత్ర



కోలలపూడిలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది, రైతులు

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై విజ్ఞాన యాత్ర నిర్వహించారు. ఏపీ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రలో స్థానిక రైతులు పలు పంటలను ప్రదర్శించారు. వెంకటరత్నం అనే మహిళా రైతు సేంద్రియ పద్ధతిలో 20 సెంట్ల భూమిలో 21 రకాల పంటలను సాగు చేసి తద్వారా నెలకు రూ.10 వేలు చొప్పున ఏడాదికి రూ.1.20 లక్షల ఆదాయం పొందతున్న వైనాన్ని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోటమ్మ, మోహన్, రాజశేఖర్, ప్రకాష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో విజ్ఞానం

మార్టూరు: మండలంలోని వలపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులచే సైన్సు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకతతో పలు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ప్రదర్శనలకు హెచ్ఎం ఎం నిర్మల బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం అద్దంకి శివారులోని ఇటుక బట్టీల వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన వై నారాయణ, అతని తల్లి వెంకాయమ్మతో కలిసి సోమవారం బైకు మీద అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో అద్దంకి సమీపంలోని కలవకూరు రోడ్డులోని ఇటుక బట్టీల వద్దరా రాగానే బైకు అదుపుతప్పి కింద పడ్డారు. గాయలవడంతో స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ సునీత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కరణం, శ్రీరామానంద సరస్వతిస్వామి

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

- వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే కరణం, రామానంద సరస్వతిస్వామీజీ
- 30 వేల మందికి అన్నదానం
- భారీగా హాజరైన జనం

చీరాల టౌన్: జై హనుమాన్... జై వీరాంజనేయ అంటూ మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని స్ట్రయిట్‌కట్ సమీపంలోని వీరహనుమాన్ నగర్ నామస్మరణలో మునిగిపోయింది. నూతనంగా నిర్మాణం చేసిన 63 అడుగుల అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా ముగిశాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠ మహోత్సవాలను వేద పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోత్తంగా జరిపించారు. సోమవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో పండితులు జరిపించారు. ఈసందర్భంగా చీరాల శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి,



జలబిందెలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

శ్రీరామానంద సరస్వతి స్వామీజి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా యజ్ఞశాలను ఏర్పాటు చేయగా పండితుల మంత్రోచ్చారణలతో మూడు రోజులు ఈపురుపాలెం జైశ్రీరామ్ మంత్రాలతో గ్రామం మారుమోగింది. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరపూజ, పంచగవ్య ప్రాసన, అఖండస్థాపన, వాస్తుహోమం, హోమాలు, గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠనంతరం 30 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో నాట్య విశారద కోకా విజయలక్ష్మీ శిష్య బృందంతో కూచిపూడి నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఈపురుపాలెంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. పోలీసులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు ట్రాఫిక్‌ను బైపాస్‌కు మళ్లించారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభయాంజనేయస్వామి వారిని వేలాది మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



నూతనంగా ప్రతిష్ఠించిన 63 అడుగుల అభయాంజనేయస్వామి

అనంత నారాయణాచార్యుల సేవలు మరువలేనివి



అనంత నారాయణాచార్యులు

యద్దనపూడి: విద్యాప్రదాత, శతాధిక ప్రతిష్ఠాచార్యులు, ఎంతో మంది శిష్యులను తయారు చేసి స్ఫూర్తి నింపిన పర్చూరు అనంత నారాయణాచార్యుల సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోలూరు గ్రామంలో వెంకటేశ్వర కళ్యాణ మండపంలో అనంత నారాయణాచార్యుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పర్చూరు శేషాచార్య స్కూల్‌ను స్థాపించి ఎందరో విద్యార్థులకు భవిష్యత్‌ను ఇచ్చిన దార్శనికుడన్నారు. అంతేకాకుండా చెన్నకేశవస్వామి ఆలయన ప్రధాన అర్చకుడిగా పనిచేశారని తెలిపారు. పలు రాష్ట్రాల్లో ఎక్కడ విగ్రహ ప్రతిష్ఠలు జరిగినా నారాయణాచార్యులు తప్పక ఉండేవారని పేర్కొన్నారు. దాదాపుగా శతాధిక విగ్రహ ప్రతిష్ఠలు చేసి పేరుగడించారన్నారు. నారాయణాచార్యులకు భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అనంతరం పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కుమారుడు శ్రీనివాసాచార్యులు, పరుచూరి వెంకటాచార్యులు, రావిపాటి మస్తానయ్య, గడగొట్టు రాంబాబు, ఎర్రబోతు చినరామస్వామి, రావిపాటి సీతయ, పెరవళి శ్రీనివాసరావు, పోలూరు కృష్ణవేణి ప్రసాద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్తలు

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కూకట్ల కన్వెన్షన్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం, సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు సోమవారం అద్దంకి వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ మాజీ చైర్మన్, ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, అద్దంకి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండలాల కన్వీనర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సెయింట్ ఆన్స్ స్కూల్లో సెమీ క్రిస్మస్



దేవుడి గీతాలకు నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

చీరాల రూరల్: స్థానిక మరియమ్మపేటలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో సోమవారం సెమీ క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్లు ఫాదర్ రత్న శేఖర్, జ్యోతి రాజులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచ మానవాళికి క్రీస్తు ప్రవచనాలు అనుసరణీయములని తన వాక్య సందేశంలో వారు పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ సిస్టర్ జీనా జేవియర్, వైస్ ప్రిన్సిపల్ ఆరోగ్య మేరి, కరస్పాండెంట్ ట్రీసా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం

చీరాల టౌన్: ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఫ్యాన్ ప్రభంజనానికి ప్రతిపక్ష పార్టీలు కొట్టుకుపోవడం ఖాయమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జి.శ్రీనివాసరావు, రూరల్ పార్టీ అధ్యక్షులు ఎ.అంకాళరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వాడరేవు గ్రామ పంచాయతీలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధితో పాటుగా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి సమంగా ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చూసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బి.సాంబశివరావు, పార్టీ నాయకులు బి.శివపార్వతి, వై.రమణ, అక్కల శ్రీనివాసరెడ్డి, సువార్త, కోటేశ్వరరావు, ప్రవీణ్, చందు, మురళీ, నారాయణ, జ్వాలా నరసింహం, మస్తాన్, సుబ్బారావు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



వాడరేవులో పథకాల బ్రోచర్ అందిస్తున్న నాయకులు

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

అద్దంకి రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 15 సంవత్సరాల నిండిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 23 లోపు అద్దంకి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు జీ. గోపినాథ్ 95429 70871 సంప్రదించాలని కోరారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవం

పర్చూరు (చినగంజాం): పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామ పొలిమేరలో స్వయంభుగా వెలసి ఉన్న నాగేంద్రస్వామి పుట్ట వద్ద వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 48వ కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహోత్సవాన్ని తిలకించేందుకు మహిళా భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో వెలిగిపోయింది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు, ప్రధాన అర్చకులు బృందావనం రమణాచార్యులు పాల్గొన్నారు.



కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు రామకృష్ణ

చీరాల రూరల్: చీరాల ఎస్ఆర్అండ్‌పీఎం వాకర్స్ అసోసియేషన్‌కు సంబంధించి 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఎన్నుకున్నారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలుదాసు రామకృష్ణ, సెక్రటరిగా చారుగుళ్ల గురుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా గుర్రం బదరీనాథ్, కేవీ సుబ్బారావు, జాయింట్ సెక్రటరీలుగా చింతా రమేష్, వంగర పూర్ణ చంద్రరావు, ట్రెజరర్‌గా గొడవర్తి సుధాకరరావు, గౌరవ సలహాదారులుగా వలివేటి మురళీకృష్ణ, మద్దు వెంకట సుబ్బారావు, గౌరవాధ్యక్షుడిగా దేగల తిరుపతిరావులను ఎన్నుకున్నారు.

కాల్షియం ఆహారంతో ఎముకలకు బలం

చీరాల: ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం ఆహారం తీసుకోవాలని ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణచైతన్య చౌదరి సూచించారు. సోమవారం పట్టణంలోని కామాక్షి కేర్ హాస్పిటల్‌లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ వైద్య శిబిరంతో పాటు ఎముకల సాంద్రత పరీక్షల ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. ఈవైద్య శిబిరానికి హాజరైన 95 మందికి ఎముకల సాంద్రత పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎముకల పటుత్వం తగ్గకుండా ఉండాలంటే కాల్షియం ఉన్న ఆహారం గుడ్లు, పాలు, బెల్లం, ప్రోటీన్ ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్, వైద్యులు నవీన్‌కుమార్, శ్యాంబాబు, సిబ్బంది ఉన్నారు.

పర్చూరు (చినగంజాం): పర్చూరు ప్రభుత్వ పాఠశాల (పెద్దబడి)లోని 125 మంది పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్యులు సోమవారం ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు.

ఉపాధి పనులపై తనిఖీలు

బల్లికురవ: ఉపాధిహామీ పథకంలో 2022–23లో గ్రామాల వారీగా జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీవో బాలకృష్ణనాయక్, ఎస్ఆర్‌పీ విజయ భాస్కర్ సోమవారం తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీలో కూలీలు, పంచాయతీ రాజు పనులకు సంబంధించి రూ.9.95 కోట్లు ఖర్చు చేశామని ఈ పనులకు సంబంధించి డీఆర్‌సీలు 7 టీమ్‌లుగా ఏర్పడి పనులు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీలు పూర్తికాగానే గ్రామభలు నిర్వహిస్తారని, తదుపరి 30న బల్లికురవలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తారని ఏపీవో, ఎస్ఆర్‌పీలు వివరించారు.